



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
సోమవారం 13-7-2026 www.prajajyothinews.com పేజీలు : 8




## ఆర్అండ్‌బి శాఖను దేశంలోనే

# నంబర్‌వన్ తీర్చిదిద్దుతాం

-రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

-రూ.76 కోట్ల, సేతుబంధు సీఆర్ఐ రైల్వే ఓవర్‌బ్రిడ్జి, ఆర్ఓబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

-ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

-2028లో ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గం పూర్తి చేసి నార్కట్పల్లి మండల ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందిస్తాం

నల్గొండ జులై 12, (ప్రజా జ్యోతి): రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖను అన్ని రంగాల్లో నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నల్గొండ జిల్లా ,నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని నార్కట్‌పల్లి మండల కేంద్రంలో 76 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నార్కట్‌పల్లి, మునుగోడు సేతుబంధు సీఆర్ఐ రైల్వే ఓవర్‌బ్రిడ్జి, ఆర్ఓబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన రహదారులు, వంతెనలు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.నల్లగొండ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రోడ్లు, సాగునీరు, వ్యవసాయం, తదితర రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతులు ఎక్కువ స్థాయిలో ధాన్యం పండిస్తున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాష్ట్రంలోనేధాన్యం అత్యధికంగా పండించిన...

మిగతా 3లో...

## నల్లగొండలో అర్ధరాత్రి

# ప్రత్యేక నాకాబందీ..

## 146 వాహనాలు సీజ్

- రౌడీషీటర్లు, అనుమానితులపై పోలీసుల ప్రత్యేక నిఘా
- 17 చెకింగ్ పాయింట్లలో విస్తృత తనిఖీలు.. భారీగా కేసులు నమోదు
- ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- జిల్లాలో ప్రజల భద్రతే లక్ష్యం - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

మిగతా 4లో...

నల్గొండ జులై 12,(ప్రజా జ్యోతి ): నల్లగొండ పట్టణంలో శనివారం అర్ధరాత్రి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రత్యేక నాకాబందీ నిర్వహించారు. పట్టణంలోని 17 చెకింగ్ పాయింట్లలో 7 మంది సీఐలు, 24..





## అవినీతి అంటే కాంగ్రెస్,

# కాంగ్రెస్ అంటే అవినీతి

-బీజేపీ రాష్ట్ర నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య

- రాష్ట్రంలో నడుస్తోంది దరఖాస్తుల పాలన

- జానకినగర్ డొంకదారి సమస్యపై త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం

5 లో..

చిలుకూరు, జూలై 12.ప్రజాజ్యోతి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన పేరుతో కేవలం దరఖాస్తుల పాలన సాగిస్తోందని, అవినీతికి మారుపేరుగా కాంగ్రెస్ మారిందని బీజేపీ రాష్ట్ర నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.


రామన్నపేట జులై 12 (ప్రజా జ్యోతి): ఏండ్లకు ఏండ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న చిట్యాల నుండి భువనగిరి వరకు నాలుగు లేన్ల రహదారి కల ప్రజా ప్రభుత్వంతో నేడు సాకారమైంది.రూ. 339.59 కోట్ల వ్యయంతో హెచ్ ఏ ఎం - హైబ్రిడ్ అన్యుటి మోడల్ విధానంలో భువనగిరి నుండి చిట్యాల వరకు రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించే నిర్మాణ పనులకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు ౘ భవనాలు, సినిమాటోగ్రఫీ...

మిగతా 5లో...

## రామన్నపేటలో నాలుగు లైన్ల రోడ్డును

# శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

-ఎమ్మెల్యే వేముల వీరేశం



## శ్రీ పట్టాభిరామాలయం లో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి శాంతి కళ్యాణం



**నార్కట్ పల్లి, జూలై 12 ( ప్రజా జ్యోతి ):** శ్రీపట్టాభి రామాలయం లో శ్రీ ఉత్తర గిరి కరుణ లక్ష్మీ నరసింహ స్వామి శాంతి కళ్యాణం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు ఉంద్ర లింగారెడ్డి భాగ్యమ్మ ఆలయ ప్రధాన అర్చకులు ఉత్తర పల్లి మణికంఠ చార్యులు పౌరోహితులు ఉత్తర పల్లి నరసింహచార్యుల ఆధ్వర్యంలోకనువిందుగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు గుంటోజు కృష్ణామాచారి విమలదంపతులుముందుగా గణపతి పూజ పుణ్యాహవాచనం నవగ్రహ శాంతి పూజ పంచామృత అభిషేకంసుధర్శన హోమం శ్రీ ఉత్తర గిరి కరుణ లక్ష్మీ నరసింహ స్వామి వారికి పాదాలు కడగడం నూతన పట్టు వస్త్రాలు జీలకర బెల్లం మాంగళ్య దారణ తలంబ్రాలు వడిబియ్యం పోయ్యడం కళ్యాణ తంతు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అర్చకులు మహాత్మ గాంధీ గుడి పంతులు చోల్లెటి పవన్ కుమార్ శర్మ,మునోజు నవీన్ శర్మ,చోల్లేటి నరేష్ శర్మ,కొత్తపేట నరసింహచార్యులు,మరియు గుంటోజు వెంకటారమణ చారి శ్రీకాత్ చారి, కొత్తపేట వెంకటాచారి,కృష్ణవేణి దంపతులు,యాట వెంకన్న ఇంజమూరి ఆంజనేయులు,ఇందిరమ్మ భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

**11వ డివిజన్‌లో డ్రైనేజీ నిర్మాణ పనుల శంకుస్థాపన**

**కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్ గౌడ్**





**నల్గొండ జులై 12,(ప్రజా జ్యోతి ):** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ ముత్యాలమ్మ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ఈ కార్యక్రమన్ని స్థానిక మున్సిపల్‌కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్ గౌడ్, డివిజన్ ఇన్‌చార్జి పజ్జేరి ప్రదీప్ పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీవాసులకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు కల్పించడం, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చిత్రం శ్రీనివాస్, పోగుల సాయికుమార్, దుబ్బ సుధాకర్, పబ్బిళ్ల రమేష్, కాసర్ల సునీత, మాతంగి హేమలతతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళ భజన మండలి బృందానికి 25 వేలు ఆర్థిక సహాయం అందజేసిన

సర్పంచ్ రమాదేవి నరసింహ గౌడ్



**మునుగోడు జులై 12 (ప్రజా జ్యోతి):** మునుగోడుమండల కేంద్రంలో శ్రీ భక్త మార్కండేయ మహిళ భజన మండలి బృందానికి సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ 25 వేల ఆర్థిక సహాయం అందజేశారు..భక్తి భావాన్ని పెంపొందించడానికి పాటుపడాలి అన్నారు..భజన మండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరామ ఆలయం క్షేత్ర కమిటీ పూజా రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అచలపరిపూర్ణ సిలివేరి సైదయ్య 13వ ఆరాధన

**అనంతగిరి జూలై 12 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో గల గీత మందిరంలో అచల సిద్ధాంత గురువు అచల పరిపూర్ణ సిలువేరి సైదయ్య 13వ ఆరాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెస్ కళాశాల సీఈఓ కోదాడ రచయితల సంఘం కోశాధికారి ఎస్-ఎస్ రావు హాజరై మాట్లాడారు అచల పరిపూర్ణ సిలివేరి సైదయ్య గీతా బోధనలతో ఎంతో మంది గీతా పారాయణ భక్తులుగా మారారని అన్నారు. గురువు సైదయ్య ఆశయాలకు అనుగుణంగా ఆయన సుమరుడు సిలువేరు లింగమూర్తి సిలివేరు సాహితీ కళా పీఠాన్ని స్థాపించి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తూ విశిష్ట సేవల అందిస్తున్నారని అభినందించారు. లింగమూర్తి వృత్తి రీత్యా లెక్చరర్ గా పని చేస్తూ సాహితీ సామాజిక,ఆధ్యాత్మిక సేవలు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెర సంస్కృతిక కళామండలి అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లింగమూర్తి బహుమక ప్రజ్ఞ కలవాలని, సిలివేరి సాహితీ కళా పీఠం ద్వారా వైద్య సేవలు కవుల పుస్తకావిష్కరణలు సన్మానాలతో 15 సంవత్సరాలుగా చేస్తున్న సేవలను కొనియాడారు. గురువుల ఆశీస్సులతో మున్ముందు ఆధ్యాత్మిక



కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిలువేరు సాహితి కళా పీఠం లింగమూర్తి అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం కవి గడ్డం కృష్ణారెడ్డి రచించిన కృష్ణ శతకం పద్య కావ్యాన్ని ఎస్ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు కళాకారులు గడ్డం కృష్ణారెడ్డి,సరికొండ నరసింహారాజు,కార్టూనిస్ట్ ఎస్ ఆనంద్,కొండ లింగారావ్ వేములవెంకటేశ్వర్లు,మాజీసర్పంచ్‌కోటేశ్వరరావు,జగన్,వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## అజ్జలాపురం ముద్దుబిడ్డకు అరుదైన గౌరవం

**-మెగావత్ చందు నాయక్‌కు 'గౌరవ డాక్టరేట్' ప్రకటన**

**-సామాజిక సేవకు దక్కిన మహోన్నత గుర్తింపు-ఆగస్టు 30న అవార్డు ప్రదానోత్సవం**

**-గిరిజన గూడెం నుంచి గౌరవ వేదిక వరకు చందు నాయక్ స్ఫూర్తిదాయక ప్రయాణం**



**మర్రిగూడ, జూలై 12(ప్రజా జ్యోతి ):** కష్టాలను అధిగమిస్తూ, నిరుపేదలు, వికలాంగులు, వృద్ధుల అండగా నిలుస్తూ సామాజిక సేవా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న యువనేత, మునుగోడు నియోజకవర్గ గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు మెగావత్ చందు నాయక్ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. గిరిజన సంక్షేమం, సమాజాభివృద్ధి, విద్యార్థుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన విశేష కృషిని గుర్తిస్తూ ప్రసిద్ధ 'ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమి ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. వచ్చే నెల ఆగస్టు 30వ తేదీన నిర్వహించబోయే ఘనమైన వేడుకలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. **కష్టాల నుంచి ఎదిగిన మహోన్నత వ్యక్తిత్వం:** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని అజ్జలాపురం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన కుటుంబంలో మెగావత్ హార్య నాయక్, పరెంగ బాయి దంపతుల ద్వితీయ సంతానంగా చందు నాయక్ జన్మించారు. చిన్ననాటి నుంచే ఎన్నో ఆర్థిక ఇబ్బందులు, కష్టనష్టాలను ఎదుర్కొన్నప్పటికీ, విద్యనే ఆయుధంగా మలచుకుని ముందుకు సాగారు. విద్యార్థి దశ నుంచే సమాజంలో ఉన్న అసమానతలపై, సామాజిక సమస్యలపై గళమెత్తారు. **హక్కుల పోరాటం -- అనాథల ఆశాకిరణం:** సబ్బండ వర్గాల ప్రజల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం ఒక బాధ్యతగల పౌరునిగా చందు నాయక్ నిరంతరం శ్రమిస్తున్నారు. ముఖ్యంగా సమాజంలో వెనుకబడిన నిరుపేదలు, వికలాంగులు, వృద్ధులకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గిరిజన తండాల అభివృద్ధి కోసం, నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు కోసం ఆయన తనదైన శైలిలో చేసిన పోరాటాలు గిరిజన సమాజంలో ఎనలేని మార్పును తెచ్చాయి. **విద్యే వికాసం యువతకు మార్గదర్శి:** "విద్య ద్వారానే సమాజంలో సంపూర్ణ అభివృద్ధి సాధ్యం" అని బలంగా నమ్మే చందు నాయక్, మునుగోడు నియోజకవర్గ గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గిరిజన విద్యార్థులను ఉన్నత విద్య వైపు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. నిరంతరం యువతను చైతన్యపరుస్తూ, వారి ఉన్నతికి తోడ్పడుతూ నేటి తరం యువతకు ఒక ఆశాకిరణంగా, నిలువెత్తు స్ఫూర్తిగా నిలిచారు. **గిరిజన సమాజానికి దక్కిన గౌరవం:** ఒక సాధారణ గిరిజన తండా నుంచి ప్రారంభమైన చందు నాయక్ ప్రయాణం.. నేడు అంతర్జాతీయ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ పొందే స్థాయికి చేరడం వెనుక ఎనలేని కృషి, పట్టుదల, నిరంతర సేవాభావం దాగి ఉన్నాయి. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల అజ్జలాపురం గ్రామ ప్రజలతో పాటు, మర్రిగూడ మండల వ్యాప్తంగా ఉన్న గిరిజన, గిరిజనేతర సంఘాల నాయకులు, మేధావులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘనత కేవలం చందు నాయక్ వ్యక్తిగత విజయం మాత్రమే కాదని, మునుగోడు ప్రాంత గిరిజన సమాజం మొత్తం గర్వించదగిన చారిత్రాత్మక ఘట్టమని పలువురు కొనియాడారు.

## హాలియా నూతన సీఐగా ఎస్.రాఘవరావు బాధ్యతల స్వీకరణ

**హాలియా,జూలై12(ప్రజా జ్యోతి) :** హాలియా నూతన సీఐగా ఎస్, రాఘవరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సతీష్ రెడ్డి చౌటుప్పల్ బదిలీ కావడంతో నల్లగొండ టూ టౌన్ సిఐగా పనిచేస్తున్న రాఘవరావును హాలియా సీఐగా బదిలీ చేస్తూ మల్టీ జోన్ ఐజీ 2 ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



శాంతి భద్రతల పరిరక్షణకే మొదటి ప్రాధాన్యతని ప్రజల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు హాలియా సర్కిల్ పరిధిలో ఎలాంటి చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన సహించేది లేదని అట్టివారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## గానుగుపల్లిలో ఏకలవ్య విగ్రహం ఆవిష్కరణ

**-మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**



నాంపల్లి, జులై,12(ప్రజా జ్యోతి):సంకల్పం, పట్టుదల, గురుభక్తితో చరిత్రలో ఏకలవ్యుడు చిరస్థాయిగా నిలిచిపోయాడని మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గానుగుపల్లిలో ఏకలవ్య విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లక్ష్యం ఉంటే మార్గం దొరుకుతుందని, అవకాశాలు లేకపోయినా ప్రయత్నం ఆగకూడదని ఏకలవ్యుని జీవితం చెబుతుందన్నారు.మునుగోడులో గతంలో జరిగిన అభివృద్ధి తప్ప ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. రైతులకు యూరియా అందించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ గుమ్మడపు నరసింహారావు, ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలుగు శంకర్, నాంపల్లి, తుంగపాడు, రేఖ్యతండ సర్పంచ్ లు నక్క చంద్రశేఖర్, కడారి శ్రీశైలం యాదవ్, నడింపల్లి యాదయ్య, బి ఆర్ ఎస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యులు ఇట్టెం వెంకట్ రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, సపావత్ సర్దార్ నాయక్, గానుగుపల్లి మాజీ సర్పంచ్ కారింగు అహల్య నర్సింహా, గ్రామ ఎరుకల సంఘం అధ్యక్షులు రుద్రాక్షల యాదయ్య, గ్రామశాఖ అధ్యక్షులు ఏపూరి లింగయ్య, కుంభం చరణ్ కుమార్ రెడ్డి, మానుపాటి యాదయ్య, కోనేటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి జాతరలో సర్పంచ్ అప్పారావు ప్రత్యేక పూజలు

**అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన దొంతగాని**



**కోదాడ రూరల్. జూలై 12. ప్రజాజ్యోతి:** కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీ గంగమ్మ తల్లి జాతరలో గ్రామ సర్పంచ్ దొంతగాని అప్పారావు పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. జాతర సందర్భంగా యాదవ మహిళలు సంప్రదాయబద్ధంగా జలబిందెలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని గంగమ్మ తల్లికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ దొంతగాని అప్పారావు ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లి ఆశీస్సులు పొందారు. జాతర భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది.



# ఆర్అండ్బి శాఖను దేశంలోనే నంబర్వన్ తీర్చిదిద్దుతాం

-రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

-రూ.76 కోట్ల, సేతుబంధు సీఆర్ఐ రైల్వే ఓవర్బ్రిడ్జి, ఆర్ఓబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

-ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

-2028లో ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గం పూర్తి చేసి నార్కట్పల్లి మండల ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందిస్తాం





**నల్గొండ జులై 12, (ప్రజా జ్యోతి ):** రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖను అన్ని రంగాల్లో నంబర్వన్ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నల్గొండ జిల్లా ,నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని నార్కట్పల్లి మండల కేంద్రంలో 76 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నార్కట్పల్లి, మునుగోడు సేతుబంధు సీఆర్ఐ రైల్వే ఓవర్బ్రిడ్జి, ఆర్ఓబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన రహదారులు, వంతెనలు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.నల్లగొండ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రోడ్లు, సాగునీరు, వ్యవసాయం, తదితర రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతులు ఎక్కువ స్థాయిలో ధాన్యం పండిస్తున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాష్ట్రంలోనేధాన్యం అత్యధికంగా పండించిన జిల్లా నల్గొండ జిల్లా అని అన్నారు.నార్కట్పల్లి,మునుగోడు రహదారి అభివృద్ధి పనుల్లో స్థానిక రైతుల భూములకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేసి నార్కట్పల్లి ప్రాంతాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి అనే రెండు లక్ష్యాలతో ముందుకు సాగుతోందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. నార్కెట్ పల్లి మండలంలో 600 కోట్లతో హ్యాం రోడ్లను,4000 కోట్లతో రాష్ట్రంలో అన్ని రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు .2028లో ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గం పూర్తి చేసి నార్కట్పల్లి మండల ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందిస్తామని చెప్పారు.ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడారు.ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, సేతు బంధు సిఆర్ఐఎఫ్ చీఫ్ వసంత నాయక్ ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, నార్కట్ పల్లి మండల అధ్యక్షులు భక్తుల ఉషయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అమరావతి ఈఎంఎస్ సంస్థను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**-స్థానిక యువతకు ఉపాధి అవకాశాలకు ఇవ్వడం అభినందనీయం**

**-అమరావతి ఈఎంఎస్ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు**



**కోదాడ రూరల్. జూలై 12, ప్రజా జ్యోతి :** కోదాడ మండలం రెడ్లకుంట గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను ఆదివారం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రారంభించారు.వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఫ్యాక్టరీని ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం సంస్థలోని ఉత్పత్తి విభాగాలు,యంత్రాలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ, కోదాడ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి ఇలాంటి పరిశ్రమలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు.అమరావతి ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేసిన వై. అనంతరావు, వై. కరాళ్ బోస్, డాక్టర్ స్టాలిన్లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పరిశ్రమ మరింత అభివృద్ధి చెంది స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన ఉత్పత్తులతో సంస్థ మంచి గుర్తింపు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడమే లక్ష్యంగా పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక యువతకు ప్రాధాన్యతనిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు, స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కార్యదర్శి, కరస్పాండెంట్ కె. కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, స్థానిక నాయకులు, సంస్థ సిబ్బంది, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో అర్ధరాత్రి ప్రత్యేక నాకాబందీ.. 146 వాహనాలు సీజ్

-రౌడీషీటర్లు, అనుమానితులపై పోలీసుల ప్రత్యేక నిఘా

-17 చెకింగ్ పాయింట్లలో విస్తృత తనిఖీలు.. భారీగా కేసులు నమోదు

-ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు-జిల్లాలో ప్రజల భద్రతే లక్ష్యం -జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్





**నల్గొండ జులై 12,(ప్రజా జ్యోతి ):** నల్లగొండ పట్టణంలో శనివారం అర్ధరాత్రి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రత్యేక నాకాబందీ నిర్వహించారు. పట్టణంలోని 17 చెకింగ్ పాయింట్లలో 7 మంది సీఐలు, 24 మంది ఎస్సైల ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసు సిబ్బంది వాహనాలు, అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన 91 మందిపై కేసులు నమోదు చేయగా, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మోడిఫైడ్ సైలెన్సర్లు, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం తదితర ఉల్లంఘనలపై చర్యలు తీసుకుని మొత్తం 146 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 134 ఈ చలాన్లు, 11 ఈ పెట్టి కేసులు నమోదు చేశారు.ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐలు,ఎస్సై లు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# 177 సీట్లతో మళ్లీ మాదే సర్కారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నార్కట్ పల్లి, జులై 12 ( ప్రజా జ్యోతి):** బి ఆర్ ఎస్ పేరును మార్చడమే ఆ పార్టీ పతనానికి కారణమైందని రోడ్లు భవనాల, శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం నుండి బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో రూ. 76 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న రైల్వే ఫై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్, వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.... ప్రజలకు నాణ్యమైన రహదారి మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రైల్వే ఫై ఓవర్ నిర్మాణాలతో నార్కట్ పల్లి, బ్రాహ్మణ వెల్లంల తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని, అత్యవసర సేవలకు వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయని, తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన జరగడం నకిరేకల్ నియోజకవర్గానికి చారిత్రాత్మక ఘట్ట మనీ అన్నారు. రూ. 76 కోట్ల భారీ వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే రైల్వే గేటు వద్ద ఏర్పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు మరియు ప్రయాణికులు, ఎంతో ప్రయోజనం పొందుతారని తెలిపారు.



ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలోని రోడ్లు, వంతెనలు, త్రాగునీరు, విద్య, తదితర రంగాల్లో అభివృద్ధి పనులు నిరంతర కొనసాగుతాయని నకిరేకల్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, పలకాన్ని ఆవిష్కరించి నిర్మాణ పనులను ప్రారంభించారు. స్థానిక ప్రజలు ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని హర్షిస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్ రెడ్డి, సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్, పాశం శ్రీనివాస్ రెడ్డి, ప్రజ్ఞ పురం సత్తి, యానాల రాంరెడ్డి, పుల్లెంల అచ్చాలు, సమద్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కంఠమహేశ్వర స్వామి కళ్యాణం



**గరిడేపల్లి,జులై 12 (ప్రజా జ్యోతి):** మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గౌడుల ఆరాధ్యదైవ మైన శ్రీ సురమాంబికా సమేత కంఠమహేశ్వర స్వామివారి దశమ వార్షికోత్సవాలు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.ఆలయ పూజారు లు బ్రహ్మశ్రీ రాయప్రోలు భద్రయ్య శర్మ, శ్రీరామయ్య శర్మ ఆధ్వర్యం లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారి కళ్యాణం,తలంబ్రాలు, మంగళహారతులు అత్యంత వైభవంగా జరిగాయి.ఆదివారం వనం మైసమ్మ,ఎల్లమ్మ దేవతలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు.దేవాలయ చైర్మన్ గూడేపూరి గోపయ్య గౌడ్,వైస్ చైర్మన్ గుండు రాంబాబు గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో సుభిక్షం, పాడిపంటలు సమృద్ధిగా ఉండాల ని ప్రతి ఏడాది ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లేపల్లి రామనాథం గౌడ్,గౌడ సంఘం మండల అధ్యక్షుడు పోలంపల్లి ఆనంద్ బాబు గౌడ్,దాతలు,పాలకవర్గ సభ్యులు,గ్రామ పెద్దలు,మహిళ లు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత ఎముకల వైద్య శిబిరం 200 మందికి వైద్య సేవలు



**భూదాన్ పోచంపల్లి, జులై 12 (ప్రజాజ్యోతి):** పట్టణ కేంద్రంలో బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం.ఎస్. విశ్వనాథ్ రాజరాజేశ్వరి నర్సింగ్ హోమ్ సౌజన్యంతో ఆదివారం ఉచిత ఎముకల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పట్టణం, మండలానికి చెందిన సుమారు 200 మంది ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అసోసియేషన్ అధ్యక్షులు సీతా భాస్కర్ ఉచిత మందులు పంపిణీ చేశారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రదీప్ ఆరోగ్య సూచనలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కడవేరు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణతో పాటు కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారులు పాల్గొన్నారు.ద

# పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాహుల్



**హాలియా, జులై 12 (ప్రజా జ్యోతి):** హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీ) నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ)డాక్టర్ కరెంటోతు రాహుల్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న ఓపీ సేవలు, మందుల పంపిణీ విధానంతో పాటు ఎన్‌సీడీ,ఏఎన్‌సీ తదితర కీలక రిజిస్టర్లను ఆయన తనిఖీ చేశారు.అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించిన డీఎంహెచ్‌ఓ...జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్‌ఓడాక్టర్ దీప,డాక్టర్ రామకృష్ణ,హెచ్‌ఏలు,ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఐ పేరిట మాయ మాటలు.. నమ్మితే నిలువుదోపిడీ

**-'ఎస్ఐఆర్ ప్రచారాన్ని ఆసరాగా చేసుకుంటున్న కేటుగాళ్లు**


**- మాటల్లో దించి వృద్ధుల నగలు మాయం.. కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వండి**

**- బీఎల్‌వోల గుర్తింపు కార్డులు చూశాకే వివరాలు చెప్పండి: సీఐ మన్మథ కుమార్**




**చౌటుప్పల్, జూలై 12 ( ప్రజా జ్యోతి ):**ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ నెపంతో వస్తూ నయా దగాలకు పాల్పడుతున్న దుండగుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరిట వస్తున్న ప్రచారాన్ని ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు సరికొత్త వ్యూహాలతో మోసాలకు తెగబడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెరిఫికేషన్ చేస్తున్నామంటూ ఇళ్ల వద్దకు వచ్చే అపరిచిత వ్యక్తులకు, గుర్తింపు లేని సంస్థల ప్రతినిధులకు ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, బ్యాంకు ఖాతా నంబర్లు, రహస్య ఓటీపీ ల వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వరాదని సీఐ గట్టిగా హెచ్చరించారు. డిజిటల్ మోసాలతో పాటు క్షేత్రస్థాయిలోనూ దుండగులు దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...ముఖ్యంగా ఈ ముఠాలు ఇళ్లలో ఒంటరిగా ఉండే వృద్ధులనే లక్ష్యంగా చేసుకుని ఈ తరహా మోసాలకు తెగబడుతున్నారని సీఐ పేర్కొన్నారు. వృద్ధులతో మాట్లాడుతూ.. 'హ×=' ఫామ్స్‌లో వెరిఫికేషన్ కోసం వచ్చామని నమ్మిస్తూ, మాయమాటలతో వారిని మభ్యపెట్టి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్తున్న ఉదంతాలు కొన్నిచోట్ల వెలుగులోకి వచ్చాయని తెలిపారు. గ్రామాల్లో, కాలనీల్లో వెరిఫికేషన్ పేరుతో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపిస్తే ప్రజలు వెంటనే అలర్ట్ కావాలని, తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.ఎన్నికల సంఘం అధికారికంగా నియమించిన బీఎల్‌వోలు మాత్రమే గుర్తింపు కార్డులతో ఓటర్ల వివరాల సేకరణకు వస్తారని, అంతేకాని అపరిచిత వ్యక్తులు వస్తే నమ్మి మోసపోవద్దని స్పష్టం చేశారు. ఓటర్లు ఎవరైనా తమ వివరాలు ఇచ్చే ముందు సదరు అధికారి ఐడీ కార్డును తప్పనిసరిగా పరిశీలించాలని చౌటుప్పల్ సీఐ మన్మధ్ కుమార్ సూచించారు.

# నిశ్చితార్థ వేడుకలకు హాజరైన సర్పంచ్ గర్దాస్ విక్రమ్, బీఆర్ఎస్ నాయకులు



**రామన్నపేట, జూలై 12: (ప్రజా జ్యోతి):**

చౌటుప్పల్‌లోని ఎంఎస్ గార్డెన్స్‌లోరామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన 11వ వార్డు సభ్యుడు వరికుప్పల స్వామి సోదరుడు వరికుప్పల వెంకటేష్--నిర్మల దంపతుల కుమార్తె మానస వివాహ నిశ్చితార్థ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బోదాస్ లక్ష్మీనారాయణ, చేనేత సహకార సంఘం అధ్యక్షులు రవ్వ నరసింహ, మాజీ ఉపసర్పంచ్ సింగనబోయిన జంగయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మంటి లింగస్వామి, పల్లపు శ్రీను, బోదాస్ నరేష్, వరికుప్పల భాస్కర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో నిశ్చితార్థ వేడుక ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

# రామన్నపేటలో నాలుగు లైన్ల రోడ్డును శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**-ఎమ్మెల్యే వేముల వీరేశం**





**రామన్నపేట జులై 12 (ప్రజా జ్యోతి):**

ఏండ్లకు ఏండ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న చిట్యాల నుండి భువనగిరి వరకు నాలుగు లేన్ల రహదారి కల ప్రజా ప్రభుత్వంతో నేడు సాకారమైంది.రూ. 339.59 కోట్ల వ్యయంతో హెచ్ ఏ ఎం – హైబ్రిడ్ అన్యుటి మోడల్ విధానంలో భువనగిరి నుండి చిట్యాల వరకు రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించే నిర్మాణ పనులకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు & భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మరియు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు.దశాబ్దాలుగా ఈ రహదారి విస్తరణ కోసం ప్రజలు ఎదురుచూస్తుండగా, ప్రజా ప్రభుత్వం ఆ కోరికను నెరవేరుస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, రహదారి భద్రత మెరుగుపడి, రవాణా సౌకర్యాలు విస్తరించి, ప్రాంతీయ వాణిజ్యం, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు లభించనుంది.ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి , భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అవినీతి అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే అవినీతి

**-బీజేపీ రాష్ట్ర నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య-రాష్ట్రంలో నడుస్తోంది దరఖాస్తుల పాలన**

**-జానకినగర్ డొంకదారి సమస్యపై త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం**




**చిలుకూరు, జూలై 12.ప్రజాజ్యోతి:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన పేరుతో కేవలం దరఖాస్తుల పాలన సాగిస్తోందని, అవినీతికి మారుపేరుగా కాంగ్రెస్ మారిందని బీజేపీ రాష్ట్ర నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చిలుకూరు మండల పరిధిలోని జానకి నగర్ గ్రామంలో బీజేపీ చిలుకూరు మండల పార్టీ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యలు – బీజేపీ పరిష్కారాలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలోని ప్రజా సమస్యలను నేతలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ చిలుకూరు మండల పార్టీ అధ్యక్షులు పారెల్లి మహేష్ సభా అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొలిశెట్టి కృష్ణయ్య కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వ పథకమూ అర్హులైన ప్రజల వద్దకు వెళ్లడం లేదని ఆరోపించారు. చివరకు ఏ చిన్న పని కావాలన్నా సరే, ప్రజలు పైరవీకారులపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలన అంటేనే అవినీతి అని, క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇదే సమయంలో జానకి నగర్ గ్రామంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన 'డొంకదారి' సమస్యను స్థానిక నాయకురాలు బట్టు చంద్రకళా ఠాకూర్,బొలిశెట్టి కృష్ణయ్య దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ డొంకదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ప్రజా సమస్యల పర్యటన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నూనె సులోచన, ఓరుగంటి కిట్టు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు భూక్య సీత, మండల ఉపాధ్యక్షులు తిప్పిరిశెట్టి బసవయ్య, ప్రధాన కార్యదర్శి కొండా శీను, దళిత మోర్చా నాయకులు మీసాల మట్టయ్యతో పాటు స్థానిక బీజేపీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన

## సతీష్ గోపాటి సన్మానించిన- పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం యాదగిరి



**రామన్నపేట జూలై 12 ( ప్రజా జ్యోతి):** రామన్నపేట పోలీస్ స్టేషన్ కి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సతీష్ త్రిపాటి ని శాలువతో సన్మానించి పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం యాదగిరి మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో పోలీస్ వారి పాత్ర ఎంతో కీలకమని వారు ప్రజల సమస్యల విషయంలో నిస్వార్థంగా నిజాయితీగా వ్యవహరించి వారికి సహకరించాలని కోరారు, ఈ సందర్భంగా ఎస్ఐ స్పందించి మాట్లాడుతూ ప్రజలు సమస్యలను ,సావధానంగా, పరిష్కరించుకొనేలా చేసుకోవాలని, మేము చట్టపరంగా న్యాయం చేయడానికి ఎల్లప్పుడు ముందుంటామని తెలియజేశారు... సన్మానించిన వారిలో గుండాల యాదయ్య పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యార్థమే ఆలయ అభివృద్ధి - చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి

## - రేకుల షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**చౌటుప్పల్, జూలై 12 ( ప్రజా జ్యోతి ):** శ్రీ అందోల్ మైసమ్మ దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న రేకుల షెడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. కొత్తపేట వాస్తవ్యులు, ప్రముఖ దాత శ్రీ విజయ్ ఆర్థిక సహాయంతో ఈ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అశ్విన్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎండ, వానల నుండి రక్షణగా ఈ షెడ్డు ఎంతో ఉపయోగపడుతుందని, దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకులు వల్లూరి శివ ప్రసాద్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ భూమి పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాత విజయ్‌ను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు జొన్నగంటి దాసు, పంతంగి రమేష్, మన్నే మహేందర్ రెడ్డి, ఈడుదుల బాబు యాదవ్, సిద్దిపేట ఆనంద్ రెడ్డి, బెతల నర్సింహ్మ, వెంకీర్యాల శివ చారి, బాలాగోని శ్రీకాంత్ గౌడ్, దొడి రాజేష్, చిట్టంపల్లి సబిత యాదయ్య, ఆలయ జూనియర్ సహాయకులు సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు బ్యాగులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్

## నేస్తం సొసైటీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు




**నల్గొండ జులై 12,(ప్రజా జ్యోతి ):** జిల్లా కేంద్రం లోని నేస్తం సొసైటీ ఆధ్వర్యంలో ఏ ఆర్ టి సెంటర్ వారి సహకారంతో హెచ్ఐవి బాధిత విద్యార్థులకు దాతల సహకారంతో 50 మంది వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్,నోటు బుక్స్, జామెంట్రీ బాక్స్, ఎగ్జామ్స్ పాడ్, పెన్నులు, పెన్సిల్ లు అందించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎయిట్ సోకిన వారు భయపడకుండా క్రమం తప్పకుండా మందులు వాడాలని జిల్లా కలెక్టర్ అన్నారు. నల్లగొండ జిల్లా కు జూన్ 2026 లో జాతీయ స్థాయిలో సక్షం స్టేటస్ గుర్తింపు వచ్చినందుకు జిల్లా అధికారులను అభినందించడం జరిగింది. అని అలాగే నేస్తం సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని సూచించారు. భవిష్యత్ లో మా వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఏ ఆర్ టి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నిగ్ధ మల్లిక మాట్లాడుతూ.. చిన్నారులకు మందుల ప్రాముఖ్యతను వివరిస్తూ జీవిత కాలం ఆరోగ్యాంగా ఉండాలని అన్నారు, అలాగే నేస్తం సొసైటీ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ సందర్భంగా నేస్తం సొసైటీ సంస్థ అధ్యక్షులు కె. వెంకన్న మాట్లాడుతూ.. గత ఏడు సంవత్సరాలుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పేద విద్యార్థులకు మరియు పేద ప్రజలకు దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడమే తమ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. నర్సింహా రావు నేత,డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ నరేష్, ఏ ఆర్ టి నోడల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరాణి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి పి సుధాకర్, ఎన్ సి డి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జమీర్,రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి, ట్రెజరర్ మద్దె డ్డీ శ్రీనివాస్ రెడ్డి,ఏ ఆర్ టి సిబ్బంది జలీల్, యాదయ్య, లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# సర్ పేరుతో ఓట్ల తొలగింపు

## - కేంద్ర ప్రభుత్వం కుట్ర- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్



**నూతనకల్, జూలై 12 (ప్రజాజ్యోతి):** ఓట్ల తొలగింపుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిపిఐ మండల పార్టీ కార్యదర్శి తొట్ల ప్రభాకర్ గౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓట్ల తొలగింపు కుట్ర చేస్తుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా నుంచి లక్షల మంది ఓట్లను తొలగించే కుట్రను అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రత్యేక ఓటరు నమోదు పేరుతో ఇప్పటికే బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలలో లక్షలాదిమంది ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, నారాయణ, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, రాములయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి దేవాలయ స్థల పరిశీలన



**హుజూర్ నగర్ జూలై 12 (ప్రజా జ్యోతి):** శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి పట్టణంలోని శివాలయం ప్రక్కన గల స్థలాన్ని ఆదివారం అయ్యప్ప స్వామి భక్త కమిటీ,పుర ప్రముఖుల ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరావు, గజ్జి ప్రభాకర్ హరిబాబు, కోతి సంపత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' పై బూత్ లెవల్ ఏజెంట్లు అవగాహన కలిగి ఉండాలి

## మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

**బయ్యారం,,జులై 12 ప్రజా జ్యోతి** పౌరులకు రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు ఓటు అని ప్రతి ఓటు కీలకం కాబట్టి సర్ ప్రక్రియలో ఒక్క ఓటు పోకుండా బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ అన్నారు. ప్రతి ఒక ఓటరు సర్ ఫారాన్ని నింపి బీఎల్ఓకు అందించేందుకు బూత్ లెవల్ ఏజెంట్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆదివారం బయ్యారం మండలం గంధంపల్లిలో సర్ ప్రక్రియపై బీఆర్ఎస్ బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ జరుగుతున్న తీరును ఏజెంట్లను హరిప్రియ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఓటర్‌ను కలిసి,వారికి ఓటు విలువను వివరించి చైతన్య పర్చాలన్నారు. సర్ ప్రక్రియలో బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లు సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు సర్ ప్రక్రియపై అయోమ యంలో ఉన్నారని,కొందరు నిర్లక్ష్యంతో ఉండవచ్చని,వారి ఇంటికి వెళ్లి సర్ గురించి వివరించి దరఖాస్తు చేసేలా కృషిచేయాలన్నారు. బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకొని సర్ ప్రక్రియలో ప్రజలను భాగస్వామ్యం చేసే బాధ్యత బూత్ ఏజెంట్లదే అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు,మద్దతుదారుల ఓట్లు తీసివేసే ప్రయత్నం చేసే ప్రమాదం ఉన్నందున ప్రతి ఓటు కీలకంగా భావించి ఎన్యుమరేషన్ ఫారం నింపి బూత్ లెవెల్ అధికారి వద్ద నమోదు చేయించాలని బీఎల్ఏలకు హరిప్రియ సూచించారు. ఒక ఓటు కూడా అన్యాయంగా తొలగించకుండా చూసే బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లు తీసుకోవాలన్నారు. డబుల్ ఓట్ల పైన పార్టీ శ్రేణులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ముఖ్య నాయకులు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.